# యజమాని

వారాల కృష్ణమూర్తి

యజమానితో సంప్రదింపులు ముగిసే సరికి రాత్రి ఎనిమిది గంటలయింది. అంతా, మా రాక కోసం ఎదురు చూసున్నారు. రాగానే చెయ్యిపైకెత్తి "విజయం మనదే"! అన్నాను.

సూర్యారావ్ - జిందాబాద్

వర్కర్స్ యూనిట్ - జిందాబాద్

జిందాబాద్‌ల కోలాహలం ముగిశాక "కామ్రేడ్స్ మన ఫ్యాక్టరీలో పని చేస్తూ కాలు పోగొట్టుకున్న రంగయ్యకు నష్టపరిహారం కింద అయిదు వేల రూపాయలతో పాటు అతని భార్యకు స్వీపర్ ఉద్యోగం ఇవ్వడానికి యాజమాన్యం ఒప్పుకుంది" అన్నాను.

ఈలలు అరుపులు చప్పట్లతో ఆవరణంతా మారు మ్రోగింది.

సెక్రటరీ సూర్యారావ్ - జిందాబాద్

వర్కర్స్ యూనిట్ - జిందాబాద్

హమారె మాంగే - లేకే రహేంగే

కైసే లేంగే - లడ్ కే లేంగే !

వర్కర్స్ ఆఫ్ ది వరల్డ్ - యునైట్ యునైట్ స్లోగన్స్ ఆపమన్నట్టు చేతులు పైకెత్తి సైగచేసి "కామ్రేడ్స్ ! మనం కలిసి కట్టుగ వున్నంత కాలం మనం సాధించంది వుండదు. కలిసి బతకడం లోనే వుంది మన బలం. ఆ సంగతి మరవద్దు." అంతిమ సందేశం అందించి యూనియన్ ఆఫీసు మూసి ఫ్యాక్టరీ ఎదురుగా వున్న ఆల్ స్టార్ హోటల్లో అందరం అరకప్పు టీ నీళ్ళు చప్పరించి విడిపోయాం.

పొద్దుటి నుండి ఎడ తెరిపి లేని టెన్షన్ వల్ల ఎంతకీ రాని సిటీ బస్సును తిట్టుకుంటూ ఆటో ఎక్కాను. ఆరు రూపాయలు వదిలించుకుని ఇంట్లో అడుగుపెట్టాను.

'ఏమైంది?" అడిగింది శ్రీమతి

"ఏమవుతుంది!" అన్నాను గర్వంగా

"ఊర్లో వన్ని పట్టించుకోక పోతే కాస్త ఇంటిపట్టున వుండి పెళ్ళాం పిల్లల్ని పట్టించుకోవచ్చుగా!" అంటూ నీళ్ళు తోడింది.

ఈ సాధింపు రోజూ వుండే వ్యవహారమే. మొదట్లో సమాధానం చెప్పేవాడిని. కాలం గడిచే కొద్దీ ఆ ప్రశ్నకు సమాధానం తెలిసే అడుగుతుందనో..... లేక నాకు ఓపిక లేకో చెప్పడం మానేశా. స్నానం ముగించి వచ్చే సరికి భోజనం వడ్డించింది.

"పిల్లలు తిన్నారా! అప్పుడే పడుకున్నారు" ఇది నేను రోజూ అడిగేదే అయినా మా ఆవిడ రోజూ సమాధానం చెబుతుంది.

"ఆ... తిన్నారు... ఇంతవరకూ చూసి ఇప్పుడే పడుకున్నారు."

"నువ్ తినెయ్యకపోయావ్!"

బదులు చెప్పకుండా తాను వడ్డించుకుంది. ఇలా ఎంత ఆలస్యమయినా నా కోసం ఎదురు చూడ్డం మా ఆవిడ తప్పు అనలేను గాని... అదో జబ్బు. ఎన్నిసార్లు చెప్పినా వినదు. ఆ వినక పోవడం వల్లేనేమో ఎన్ని పనులున్నా త్వరగా ఇల్లు చేరుకోవాలనే తపన నాలో మొదలవుతూంది. ఆడవాళ్ళు అడక్కుండానే తమకు కావలసిన పద్ధతిలో మగవాళ్ళను మలచుకుంటారనడానికిదో మచ్చు తునక.

"రంగయ్య సంగతి చెప్పారు కాదు."

చెప్పాను.

భోజనం ముగించి పెరట్లో చెయ్యికడుక్కుని అక్కడే వున్న మంచం మీద కూర్చున్నా.

మా ఆవిడ గిన్నెలన్నీ సర్దుతుంది.

"ఏమేవ్... కాస్త నా సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె!" లేవడానికి బద్ధకం వేసి అడిగాను.

"ఆ ం...!"

మంచం మీదకూర్చుని ఆకాశంలోని నెలవంక నుండి జాలువారుతున్న వెలుగు తెరల మేలి ముసుగులో పరుగులు తీస్తున్న తెల్ల మబ్బుల్ని చూస్తుండి పోయా.

"ఇదిగో!" అంటూ సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె మంచం మీద పెట్టి పోబోయింది.

"ఎక్కడికి?"

"పది దాటింది. మళ్ళీ పొద్దున్నే లేవాలా!"

నా ఆలస్యాన్ని అలా సాధిస్తుంది మా ఆవిడ.

"సర్లే రావే..." అంటూ చెయ్యి పట్టుకుని లాగాను మంచం మీద ఒద్దిగ్గా కూచుంది. సిగరెట్ ముట్టించి ఒక్క దమ్ములాగి తృప్తిగా పొగ వదిలి మా ఆవిడని మరింత దగ్గరకు లాక్కున్నా.

"వెధవ సిగరెట్.... నాకన్నా మీకదే ముఖ్యం!"

ప్రతి మనిషికి ఏదో ఒక బలహీనత. నాకు రెండు. ఒకటి సిగరెట్. రెండు యూనియన్. యూనియన్ను వదల్లేను. సిగరెట్ మానేద్దామని చాలా సార్లు గట్టి నిర్ణయం తీసుకున్నాగాని అనుభవం మీద మానలేనని తేలిపోయింది. అదిగో ఒక్కడే మా ఆవిడకు చులక నయ్యాను.

"పెళ్ళికి ముందు నేను సిగరెట్ తాగుతానని తెలీదేమిటి?"

"అప్పుడు వేరు!" అంది చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఇప్పుడు కాలడం......" నవ్వాను.

"మీకు సిగరెట్ ముఖ్యమా ... పెళ్ళాం ముఖ్యమా!"

"బాగుంది వరస... సిగరెట్ అందించే నువ్ కావాలి. నీ చేత్తో ముట్టించిన సిగరెట్.. అబ్బో.."

"చాల్లెద్దురూ మాటలు నేర్చారు!" అంది వచ్చే నవ్వు నాపుకుంటూ.

"పెళ్ళయ్యాక మాటలు పడి పొయ్యాయేమిరా అంటుంది మా అమ్మ. అంతా వినిపించేట్టు కాదనుకో హెన్ పెక్‌డ్ హస్బెండ్ - అనగా పెళ్ళాం కొంగు చాటు కుక్క పిల్ల - అదే మొగుడు పిల్లాడు అంటున్నారు తెలుసా!"

"అందుకని నా మాట వినరా!"

"నేనూ అదే అంటున్నాను. నేను నా పెళ్ళాం మాట కాక పోతే ఎవరి పెళ్ళాం మాట వినాలి అని."

"చాల్లెండి మీ మాటలు." అంటూ లేచింది. నేను మా ఆవిడ ననుసరించాను.

పిల్లల్ని ఓ వారకు అమర్చి నడుం వాల్చాను. పక్కనే మా ఆవిడ చేరింది లైటు తీసేసి.

"పాపం శారద!" అంది మా ఆవిడ

"ఏ శారద?"

"అదేనండి మీ ఫ్యాక్టరీలోనే పన్జేస్తాడు. సల్లగా చింత మొద్దులా మన వెనుక వైపు సెంకుటింట్లో..."

"ఆఁ... ఏమయింది?"

"పాపం ఒళ్ళు వాచి పోయేలా కొట్టాడండి!"

"ఎందుకు?"

"మగాళ్ళు ఎందుకు ఎప్పుడు ఎగురుతారో ఎవరికి తెలుసు" చీకట్లోనే గుసగుస లాడింది.

"బాగుంది వరస. అసలు విషయం చెప్పక అదేదో నేను విన్ను తప్పి నట్టు చిర్రు బుర్రు లాడతావేం!"

"అదొక్కటే తక్కువ!"

"ఔను. అన్నీ అయ్యాయి. అవనీ చేసేస్తే.." అంటూ దగ్గరకు తీసుకున్నాను.

* * *

"సుబ్బారావ్ భార్యని హాస్పటల్ లో చేర్చారు!"

"అబార్షన్....అయిందట... వెళ్ళి చూసి రాకూడదూ..."

"వెళ్ళాను.... బండ వెధవ ఉతికేశాడుగా ఎక్కడ తగిలిందో ఏమో!"

"ఎలా వుంది!" అడిగాను.

ఉదయం వారపత్రిక



"ఏదోలా వుంది. ఆ పిల్ల తల్లి వచ్చింది. పలకరించా. కంట తడి పెట్టుకుంది. పాపం శారద మాత్రం ఎందుకమ్మా ఏడుస్తావ్... అని తల్లిని ఓదారుస్తుంది... చిత్రం..."

"అందుకే కాబోలు సుబ్బారావు ఫ్యాక్టరీకి రాంది".

"మరి మీకెలా తెలుసు" ఆశ్చర్యంగ అడిగింది.

"వాళ్ళ పక్కింటి గురునాథం చెప్పాడు"

"శారదేమో ఆయన ఫ్యాక్టరీకెళ్ళాడంది"

"ఏమో ఎక్కడికెళ్ళాడో...."

వారం రోజుల తరువాత సుబ్బారావు యూనియన్ ఆఫీసు కొచ్చాడు. శలవు మంజూరు చెయ్యడం లేదని చెప్పాడు.

"వెధవ నీకెన్ని సార్లు చెప్పాను. ప్రతినెలా నీకు శలవు గొడవే!" యూనియన్ మెంబరు కసురు కున్నాడు.

"నా శలవు నాకివ్వడానికి ఏటండీ ఫ్యాక్టరీ వాళ్ళకు. నాకు శలవు లేదా – వుంది. వున్నది వాడుకోను కాదా?" సుబ్బారావు దురుసుగా జవాబిచ్చాడు.

"శలవు నీదే. దాన్ని వాడుకోనూ ఓ పద్ధతుంది.

## ఇంటు గెలవని రచ్చ గెలుపు!

ముందుగా చెబితే ఎవ్వరూ ఇవ్వమనరు. ఇలా అర్థాంతరంగా పని ఎగ్గొట్టి శలవంటే ఓనర్ వూరకుంటాడా?"

"మీరు యూనియన్ తరపున మాట్లాడుతున్నారా లేక ఓనర్ తరపున వకాల్తా పుచ్చుకున్నారా" ప్రశ్నించాడు సుబ్బారావు.

అవకాశం కోసం చూస్తున్న అపోజిషన్ మెంబర్ "యాజమాన్యానికి అమ్ముడు పోయిందా యూనియన్. ఒక వర్కర్ అవసరం పడి ఫ్యాక్టరీకి రాలేక పోతే శలవు మంజూరు చేయించలేని వాళ్ళు దిగిపోండి." అంటూ రెచ్చిపోయాడు.

సుబ్బారావు సంగతి తెలుసు నాకు అందుకే "సుబ్బారావ్... నీ శలవు మంజూరవుతుంది. నువ్ పనిలోకెళ్ళు" అన్నాను.

సుబ్బారావు వెళ్ళాడు.

"యజమానికి వర్కర్ల మీద దయా దాక్షిణ్యాలుండవు. వాళ్ళు వర్కర్ల రక్తాన్ని తాగుతారు. అలాంటి యజమాన్ని వెనకేసుకొస్తారా. మీరు సుబ్బారావు శలవు మంజూరు చేయించక పోతే నేనో.. మీరో...తేలిపోతుంది." అపోజిషన్ మెంబర్ హెచ్చరించి మరీ వెళ్ళాడు.

సుబ్బారావు కోసం యజమాని దగ్గరకెళ్ళాను.

"ఈసారి కోర్కె లేమిటో..." వ్యంగ్యంగా అన్నాడు యజమాని. "వర్కర్స్‌కు రెస్టు రూం కట్టించండి. మధ్యాన్నం మీరిచ్చే వేడినీళ్ళు మీరొక సారి తాగి చూడటం......"

"మిస్టర్ సూర్యం నువ్ యూనియన్ నాయకుడయ్యాక ప్రొడక్షన్ దెబ్బతింది. వర్కర్స్‌కు సౌకర్యాలంటూ గొడవ పెడతావు. సౌకర్యాలు మీరితే పనేం చేస్తారు. సౌకర్యాలు ఆకాశం నుండి వూడి పడతాయా రూకలు రాల్చాలి. ఎవరిస్తారా రూకలు. నేను ఫ్యాక్టరీ పెట్టింది మీ సౌకర్యాలు చూడటానికా లేక నాలుగు రాళ్ళు సంపాదించుకోడానికా. కావాలంటే నువ్... ఓ రెండు రాళ్ళు తీసుకో సమస్యలతో రాకు. నాకు సమస్య కాకు."

"మీరిచ్చే రెండు రాళ్ళు ఎందరి నోళ్ళు కొడతాయో మీకూ బాగా తెలుసు. ఆత్మవంచన చేసుకోలేను."

"అసలు విషయం!" అడిగాడు యజమాని.

"కాష్యుల్ లేబర్.... ఎంతకాలమలా వాళ్ళు పని చెయ్యాలి. వాళ్ళనీ జన్మలో రెగ్యులరైజ్ చెయ్యరా!"

"అది వ్యయంతో కూడుకున్న పని. బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్‌తో చర్చించాలి."

"ఎవరండి బోర్డు డైరక్టర్లు. మీ తమ్ముడు, మీ బావమరిది, మీ మామ అంతా మీవాళ్ళేగా"

"వంగ తోటలో మామా అంటే ఎలా! ఫార్మాలిటీస్ ఫార్మాలిటీసే."

"వర్కర్స్ కిచ్చే టీ నీళ్ళు కొత్త రంగులోనే కాక రుచిలో కూడ మార్పు కావాలి."

"దిస్ కేన్ బి డన్"

"రెస్టు రూం"

"మొదటి ప్రశ్నకు సమాధానమే దీనికి.."

"సుబ్బారావు శలవు శాంక్షన్ చెయ్యండి."

"నో..... అతను ఎప్పుడు పని ఎగ్గొడతాడో తెలీదు. అతన్ని నమ్ముకుని ఫ్యాక్టరీ నడపలేం. అసలు అతన్ని తీసెయ్యాలనుకుంటున్నాను."

"అలాగయితే మీ ఫ్యాక్టరీ మూసెయ్యాల్సి వస్తుంది. సుబ్బారావ్ పరిస్థితి మీకు తెలీదనుకుంటాను. అతని భార్య ఆస్పత్రిలో వుంది. అందుకే అతను రాలేక పోయాడు."

"అతని మాటలు నువ్ నమ్మావా!"

"కళ్ళారా మా ఆవిడ చూసి చెప్పింది"

"సరే! ఈసారికి వదిలేస్తున్నా. మళ్ళీ ఇలా చెప్పాపెట్టకుండా ఎగ్గొడితే నా పని నేను చేస్తా.."

"అప్పుడాలోచిద్దాం లెండి" అంటూ బయటకొచ్చాను.

యజమాన్యం దగ్గర మనకు రావాల్సిందాన్ని రాబట్టుకోను బలీయమైన నాలుగైదు కోర్కెలు ముందుంచి చివర్న మనకావాల్సింది తగిలిస్తే ఎలాగూ మొదటివి తీర్చలేక అన్నీకాదనలేక ఆచివరిది ఒప్పుకుంటారు. ఇది అనుభవసారం.

సుబ్బారావుని పిలిచా. 'ఇహ జాగ్రత్త!' అని హెచ్చరించాను.

"అదేమిటండీ వీడు నన్ను బెదిరించడం. వాడి తరపున మీరు నన్ను హెచ్చరించడం... ఈ ఫ్యాక్టరీ పోతే మరో ఫ్యాక్టరీ. ఈ ప్రొప్రయిటర్లంతా జలగలు. మనల్ని పీల్చి పిప్పి చెయ్యడమే వాళ్ళ పని." అని ఈసడించుకుని వెళ్ళాడు.

•  •  •

"ఫ్యాక్టరీ .... యూనియన్.. ఇల్లు... ఈమూడే నా జీవితంలోని భాగాలు. అన్నిట్లోనూ ఏదో విధంగా సుబ్బారావు తొంగి చూస్తున్నాడు.

"ఇది విన్నారా... ఆస్పత్రి నుండి వచ్చిందా పిల్ల. వాళ్ళ అమ్మ వుందన్న బుద్దయినా లేక అప్పుడే మొదలెట్టాడు మీ సుబ్బారావు." అంది మా ఆవిడ.

"ఏం చేశాడూ!"

"రోజూ చేసేదే. ఈసారి తల మీద కంచంలో కొట్టాడంట".

"ఎందుకు?"

"అన్నంలో రాయి వచ్చిందని! పాపం గాయమై రక్తం వచ్చిందట. వాళ్ళమ్మ అది చూడలేక.. ఏంది నాయనా ఈ విడ్డూరం... అంటే ... అంత విడ్డూరమనిపిస్తే తీసుకెళ్ళు నీకూతుర్ని... అని తిట్టి పోశాట్ట."

"పోనీ లెద్దూ వెధవ గొడవ!" అన్నాను విసుగ్గా.

"మీ కలాగే అనిపిస్తుంది. పాపం ఆ పిల్ల ఏ మూహూర్తాన వీడిని చేసుకుందో..."

"ముహూర్తంలో ఏముందే నీ పిచ్చిగాని..."

"అదే లెండి ఏనాడు కట్టుకుందో... మెడకు తాడు..."


"వెధవ గొడవ వదిలెయ్. ఎన్ని సార్లు చెప్పాలి" కసిరాను.

"మీరు మీ యూనియన్ గొడవలు వదిలేస్తారా!" అక్కసుగా అడిగింది.

"దానికి దీనికి సంబంధం ఏమిటే?"

"బోల్డుంది!"

"నాకు ఓపిక లేదుగాని నన్ను వదిలిపెడుదూ!"




### అర్ధాంగి

ఒరే పార్వతీశం! దుక్కలా ఉండేవాడివి! పెళ్ళికాగానే సగమయ్యా వేమిట్రా!' అడిగాడు గుర్నాధం.

'సగం మా ఆవిడ తీసుకుంది' అర్ధాంగి కదా!' చెప్పాడు పార్వతీశం.

రాయవరపు రవి, రామాయంపేట

# కార్మికుల సతులారా ఏకంకండి!

"మగ వాళ్ళంతా ఇంతే!"

• • •

సుబ్బారావులో మార్పు కుక్కతోక లాగే వుంది. మళ్ళా చెప్పాపెట్టకుండా మాయమయ్యాడు. పదిరోజులు చూసి యజమాని నోటీసు పంపాడు పనిలో వచ్చి చేరమని. అయినా సుబ్బారావు జాడ కనబడలేదు. ఏమయిందోనని ఆరోజు సుబ్బారావు ఇంటికెళ్ళాను.

"కూర్చోండన్నగారూ.. ఆయన సిగరెట్ కోసం వెళ్ళారు!" అంటూ కుర్చీ చూపించింది శారద.

"ఫ్యాక్టరీకి రావడం లేదెందుకమ్మా!"

ఆమె నుండి బదులు లేదు.

"ఇలా పని ఎగ్గొడితే యజమాని వూరుకుంటాడా. నోటీసు పంపాడు అందిందా!" అంటూ ఆమె వైపు చూశాను.

శోక దేవతలా నిల్చుంది. అయినా నా పిచ్చిగాని ఈ విషయాలు సుబ్బారావునే అడగాలి అనుకుంటూ ఆమెను పరికించి చూశాను. నీరసంగా వుంది. మాసిన చీర... రేగిన జుత్తు... గుంతలు పడ్డ కళ్ళు... నుదుట గాయం... అదే కాబోలు మా ఆవిడ చెప్పింది.

"కాఫీ తెస్తానండి!" అంది శారద.

"వద్దమ్మా! ఇప్పుడే తాగేను... చూడమ్మా ఏం చదువుకున్నావ్?"

"పది పాసయ్యానండి!"

"మరి చదువుకున్న దానివి భర్తని సరిగా ఉద్యోగానికి పంపలేక పోవడం ఏమిటమ్మా!"

"నా మాట వింటారా!"

"చెప్పి చూశావా!"

అదోలా నవ్వింది. ఆ నవ్వులో ఎన్ని విషాద రాగాలో... ఇంతలో వచ్చాడు సుబ్బారావు.

"రావోయ్ నీగురించే..." అన్నాను.

"అలా నిలబడ్డావే! లోపలికి చావు" పులిలా అరిచాడు సుబ్బారావు. మేకలా జడుసుకుని పారిపోయింది శారద. ఆ హఠాత్ పరిణామానికి వెంటనే తేరుకో లేక పోయాను.

"ఏమిటలా వచ్చారు!" అడిగాడు సుబ్బారావు.

"నోటీసు అందిందా!"

"ఆఁ!"

"మరెందుకు జాయిన్ కాలేదు"

"వాడు చెప్పినట్టల్లా నేను వినాలా! ఇంకో నాలుగు రోజులు పోయాక వస్తాను".

"అది కాదు సుబ్బారావ్... నువ్ వెంటనే చేరకపోతే..."

"తీసేస్తాడా... తీసెయ్యనీ... నాకేం – చేతిలో పనుంది. ఈ ఫ్యాక్టరీ కాకపోతే మరో ఫ్యాక్టరీ.... ఇలా భయపడితే యజమానులు స్వారీ చేస్తారు." అంటూ సిగరెట్ ముట్టించి నా వైపు సిగరెట్

**కరేన్ ఏదీ.. కనబడదేం?**

–మహాదర్శకుడు మృణాల్ సేన్‌ని మీకు వచ్చిన యాడ్ ఏది? అనడిగితే ఆయన తడుముకోకుండా 'లిరిల్ సబ్బుయాడ్' అని చెప్పారు.

స్నానానికి వెడితే చాలు, నాకు ఆ సబ్బు అడ్వర్టయిజ్‌మెంట్ కనిపిస్తుంది. జలపాతం దగ్గర స్నానంచేస్తున్న కరేన్ లారెల్.. బాత్ రూమ్‌లో నా కనులముందు సయ్యాట ఆడుతుంటుంది. ఈ వయస్సులోని నాకే అలా ఉంటే.. యువకుల మాటేమిటి! అంటూరాయన. అలా అంటూనే 'అవునూ అంత అందమైన అమ్మాయి — అదే, కరేన్ లారెల్ ఎక్కడా కనబడ్డం లేదేంటి?' అని అడుగుతున్నారాయన!!

పెట్టె చూపించాడు.

వద్దన్నాను. ఇహ అక్కడ వుండబుద్దికాక "నేను చెప్పాల్సింది చెప్పాను. వస్తా!" అంటూ లేచాను.

"మంచిది!"

సుబ్బారావు మనస్తత్వం ఓపట్టాన అంతు పట్టిందికాదు. మూర్ఖుడను కోవాలా – పొగరుబోతను కోవాలా. అతని దృష్టిలో తతిమ్మా వారంతా అలాంటి వాళ్ళే. అన్నట్టు మా ఆవిడ కోసం కొన్న పూలు సంచిలో పెట్టి అక్కడే వదిలానని గుర్తు కొచ్చి వెనక్కు వెళ్ళాను.

"వెధవ ముండా! పరాయి మగాడి ముందు నిల్చుని ఏమిటా మాటలు. వాడు నాగురించేం చెప్పాడు. నువ్ వాడికేం చెప్పావ్."

వీధిలోకి వినబడుతున్నాయి మాటలు.

"మాట్లాడవేం! ఇలా చెప్పవు..." అంటూ జుట్టు పట్టుకుని బయటకు లాక్కొచ్చాడు. నన్ను చూసి ఆమెని వదిలాడు.

"సంచి మరిచా!"

సుబ్బారావు సంచి తీసుకొచ్చి ఇచ్చాడు. సుబ్బారావుని గాని శారదనుగాని చూసే ధైర్యం లేక గబగబా అడుగులేస్తే ఇల్లు చేరుకున్నాను.

రాగానే అడిగింది శ్రీమతి 'ఏమిటలా వున్నారు?' అని.

"ఏమీ లేదు. అంత కాఫీ పట్టుకురా!" అంటూ సంచి అందించి వాలు కుర్చీలో వాలిపోయా.

కాఫీ ఇచ్చింది. అది చప్పరించి తేరుకుని జరిగిందీ చూసిందీ చెప్పాను.

"వాడలా ఆ పిల్లని చావగొడ్తుంటే చూస్తూ పారిపోయి వచ్చారా!" కస్సుమని లేచింది మా ఆవిడ.

"నేనేం చెయ్యను!"

"మీరు యూనియన్ లీడరుగా!"

"అది ఫ్యాక్టరీలో..."

"మిమ్మల్ని లీడరుగా పెట్టుకున్న వాళ్ళననాలి. పాపం వాళ్ళెంత పిరికి సన్నాసులో.."

"చాల్లే పరిహాసాలు!"

ఆరోజంతా అన్యమనస్కంగానే గడిచిపోయింది. పిల్లలు పలకరించినా ఆఁ,వూఁ లతోనే సరిపుచ్చాను. చిన్నది కథ చెప్పమన్నా పెద్దాడు పాఠం చెప్పమన్నా "మీ అమ్మ నడగండి!" అని తప్పుకున్నాను.

• • •

శ్రీమాన్ సుబ్బారావుకు ఫ్యాక్టరీలో వుద్యోగం పోయింది. అయినా అతను జల్సాగనే కనబడుతున్నాడు. నెలరోజులు తిరక్కుండానే వుద్యోగం మరో ఫ్యాక్టరీలో దొరికింది. అతని పనే బాగుంది.

ఔను వాడికేం ఈ ఫ్యాక్టరీ కాకపోతే మరో ఫ్యాక్టరీ!

• • •

"నిన్న రాత్రి పాపం శారదను ఇంట్లోనుండి గెంటేశాడంట. ఆ పిల్ల రాత్రంతా ఇంటి ముందే ఒంటరిగా పడి వుందట. పొద్దున కూడ ఇంటికి తాళం వేసుకుని వెళ్ళాడట. పక్కింటి వాళ్ళు రమ్మన్నా ఆ పిచ్చిపిల్ల రానంటూ అక్కడే వాకిలి ముందు కూర్చుందట". తాజా వార్త అందజేసింది మా ఆవిడ.

"వాడంతగా బలి చేస్తున్నప్పుడు పుట్టింటికి పోరాదూ!" అన్నాను.

మా ఆవిడ తోక తొక్కిన తాచులా ఒంటికాలి మీద లేచింది. "పుట్టింటికా.... ఎందుకు పోవాలి! వాడ్ని పొమ్మనండి మీరూ.... మీ లీడర్లూ అంతా మగరాయుళ్ళు. మీకు యూనియన్లున్నాయి. మాకేవీ...... ఆ పిల్ల అలా బలైపోతుంటే చూస్తూ వూరుకుంటున్నాం. వాడేమో నచ్చని ఫ్యాక్టరీలని యూనియన్లని చొక్కాగుడ్డల్లా మార్చగలడు. పాపమా పిల్ల వాడిని కాదని ఎక్కడికి పోతుంది." అంటూ పాఠం చెప్పింది.

మా ఆవిడ నాకు పాఠాలు చెప్పడం కొత్తకాదు. పెళ్ళికి ముందునుండి పాఠాలు చెబుతూనే వుంది. ఈ సారి కాస్త ఘాటయిన పాఠం.

నెలరోజుల తరువాత మా ఆవిడ కొత్త డోర్ కర్టన్ తగిలించింది. ఇది వరకు కర్టన్స్ మీద వర్కర్స్ ఆఫ్ ది వరల్డ్ యునైట్ అని వుండేది. అప్పుడు మా యజమాని మనసులో మెదిలేవాడు.

ఇప్పుడు వైవ్స్ ఆఫ్ ది వరల్డ్ యునైట్ అని వుంది. సుబ్బారావు గుర్తు కొచ్చాడు.

యజమానికి సుబ్బారావుకూ తేడా వుందంటారా!